సాక్షి
జగిత్యాల
బుధవారం। 13। సెప్టెంబర్। 2023



ఉద్యోగులతో కలిసి నిరసన
రాయికల్(జగిత్యాల): హక్కుల సాధన కోసం అంగన్‌వాడీ సిబ్బంది చేపట్టిన సమ్మెలో బాలింత బొంగోని సింధూరి పాల్గొని నిరసన తెలిపారు.



పాడిపంటలు బాగా పండాలి
మల్లాపూర్ : పాడిపంటలు బాగా పండాలని, ప్రజలు సుఖసంతోషాలతోఉండాలని ఆదివాసీలు శీత్లాభవాని పండుగ జరుపుకున్నారు.

గరిష్టం/కనిష్టం
30.0/24.0


వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో ఉరుములు, మెరుపులతో కూడిన చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు ఎమ్మెల్సీ కవిత రాక

ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల/జగిత్యాలరూరల్/కొండగట్టు: ఎమ్మెల్సీ కవిత బుధవారం కొండగట్టు శ్రీఆంజనేయస్వామిని దర్శించుకుంటారు. సాయంత్రం 6గంటలకు సహస్ర దీపాలంకరణ కార్యక్రమంలో పాల్గొంటారు. ఆమె రాకతో శ్రీరామకో టి స్థూపం ప్రారంభానికి నోచుకుంటుందని భ క్తులు భావిస్తున్నారు. అలాగే భేతాళస్వామికి చందనోత్సవం జరుపుతారని ఆశిస్తున్నారు. చల్‌గల్ శివారు మామిడి మార్కెట్‌లో జరిగే జగిత్యాల నియోజకవర్గ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఆమె పాల్గొంటుందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ తెలిపారు. ఈమేరకు మంగళవారం ఏర్పాట్లను ఆయన పరిశీలించారు.

ఎస్సారెస్పీ 10 గేట్లు ఎత్తివేత

గోదావరిలోకి విడుదలవుతున్న నీరు

జగిత్యాలరూరల్: ఎగువన నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో ఎస్సారెస్పీ నిండుకుండలా మారింది. దీంతో మంగళవారం సాయంత్రం 6 గంటల వరకు ప్రాజెక్టుకు చెందిన 10 గేట్లు ఎత్తి 31,200 క్యూసెక్కులను గోదావరి నదిలోకి వదిలారు. ఎగువ ప్రాంతాల నుంచి ప్రాజెక్టులోకి 37,688 క్యూసెక్కుల భారీ వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1091.00 అడుగులు కాగా ప్రస్తుతం 1091.00 అడుగులకు చేరింది. నీటినిల్వ సామర్థ్యం 90.313 టీఎంసీలు కాగా ప్రస్తుతం అదేస్థాయిలో నిల్వలు ఉన్నాయి.

డిమాండ్లు నెరవేర్చండి

అంగన్‌వాడీలతో విజయలక్ష్మి

జగిత్యాలటౌన్: ప్రభుత్వం నిరంకుశ వైఖరి వీడి అంగన్‌వాడీ, అర్బన్ హెల్త్ సెంటర్ ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం, ఉద్యోగ భద్రత కోసం స్థానిక తహసీల్ చౌరస్తాలో నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, అర్బన్ హెల్త్ సెంటర్ ఉద్యోగులను మంగళవారం ఆమె కలిసి సంఘీభావం తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతో తమ జీవితాలు మారుతాయని భావించి ఉద్యమించిన ఉద్యోగులకు సీఎం కేసీఆర్ నిరంకుశ పాలనలో వేధింపులు ఎదురవుతున్నాయన్నారు. వివిధ పార్టీల నాయకులు రఘువీర్‌గౌడ్, తోట నరేశ్, పెద్దులు అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

విద్యుత్ కనెక్షన్లు తీసుకోండి
జగిత్యాలరూరల్: జిల్లాలోని వినాయక మండప నిర్వాహకులు తాత్కాలికంగా విద్యుత్ కనెక్షన్లు తీసుకోవాలని ట్రాన్స్‌కో ఎస్‌ఈ సత్యనారాయణ సూచించారు. మంగళవారం ఆయన జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. పోలీసు శాఖ అనుమతిపత్రంతోపాటు, విద్యుత్ కనెక్షన్లు తీసుకుని, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. పది రోజుల కోసం ఒక కిలోవాట్స్ వరకు రూ.1,560, ఒకటి నుంచి 1.5 కిలోవాట్స్ లోడ్ వరకు రూ.2,300, 1.5 నుంచి 2 కిలో వాట్స్ వరకు రూ.3,020, 2 కిలో వాట్స్ పైబడితే రూ.3,020 నుంచి ప్రతి కిలోవాట్‌కు రూ.1,500 చొప్పున చెల్లించాల్సి ఉంటుందన్నారు. వీటితో పాటు నాణ్యమైన విద్యుత్ పరికరాలు వినియోగించాలని ఆయన సూచించారు.

ప్రజలకు కేసీఆర్ శ్రీరామరక్ష
జగిత్యాలరూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రజలకు సీఎం కేసీఆర్ శ్రీరామరక్ష అని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లాస్థాయి సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మన ఊరు.. మన బడి కార్యక్రమం చేపట్టిందన్నారు. దీనిద్వారా జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించామని చెప్పారు. మాతాశిశు కేంద్రంలో ప్రసవాల సంఖ్య పెరిగిందని తెలిపారు. కానీ సాధారణ కాన్పులు చేసేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రతీరోజు పారిశుధ్య పనులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. జిల్లాలో చేపట్టిన పనులను నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ పూర్తిచేయాలని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీసీఈవో నరేశ్, సిబ్బంది పాల్గొన్నారు.


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు


క్యూలైన్‌లో బారులు


కోనేరులో స్నానాలు..

శ్రీఆంజనేయం
కొండగట్టు(చొప్పదండి): శ్రావణంలో చివరి మంగళవారం కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. తొలుత కోనేటిలో పుణ్యస్నానాలు ఆచరించారు. క్యూలైన్ ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేకపూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. తలనీలాలు సమర్పించుకున్నారు. అయితే, వాహనాలను క్రమబద్ధీకరించడంలో పోలీసులు విఫలం కావడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోడ్డుకు ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. కాగా, సుమారుగా 30 వేల మంది భక్తులు రాగా, ఆలయానికి సుమారు రూ.12లక్షలకుపైగానే ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు. ఈవో వెంకటేశ్, ఏఈవో శ్రీనివాస్, సూపరింటెండెంట్లు శ్రీనివాసశర్మ సునీల్, సీనియర్ అసిస్టెంట్ ఉమామహేశ్వర్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వదిలేసి వెళ్లినవారు వచ్చేశారు
సాక్షి స్పందన

కోరుట్ల: 'మళ్లీ వస్తామని చెప్పి.. వదిలేసి వెళ్లారు'.. శీర్షికన మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనం అయినవాళ్లను కదిలించింది. అభాగ్యురాలు మిర్యాల లక్ష్మి బంధువులు నిజామాబాద్ జిల్లా నందిపేట నుంచి మంగళవారం కోరుట్లకు చేరుకున్నారు. ఆమెను ఆస్పత్రిలో చేర్పించడానికి సాయం చేసిన కౌన్సిలర్ పేర్ల సత్యంను కలిశారు. జగిత్యాల ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మిర్యాల లక్ష్మి వద్దకు వెళ్లారు. ఆమె ఆరోగ్య పరిస్థితి కుదుటపడంతో నందిపేటకు తీసుకెళ్లారు. కాగా, అనారోగ్యంతో బాధపడుతున్న లక్ష్మి.. నాలుగు రోజుల క్రితం ఓ బంధువుతో కలిసి నందిపేట నుంచి ఎటో వెళ్లిపోయిందని బంధువులు తెలిపారు. అయితే, కోరుట్లలో ఉన్నట్లు తమకు సమాచారం అందడంతో తాము ఇక్కడి వచ్చి ఆమెను తీసుకెళ్తున్నామని వారు వివరించారు.

సమస్యలతో సతమతం
- అభివృద్ధికి దూరం
- శివారు కాలనీల్లో దుస్థితి
- పట్టని ప్రజాప్రతినిధులు
- నిర్లక్ష్య ధోరణిలో అధికారులు

సాక్షి ఫోకస్


వరద నీరు నిలిచి అధ్వానంగా ఉన్న ఈ రోడ్డు మెట్‌పల్లి మున్సిపల్ 13వార్డు బాలకృష్ణానగర్ లోనిది. ఇది శివారుకాలనీ. వందకుపైగానే నివాసాలు ఉన్నాయి. ఎక్కడ చూసినా బురద రోడ్లు, పిచ్చిమొక్కలు. రోడ్లపై పారే మురుగునీరే కనిపిస్తోంది. వీటితో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏటా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పట్టణాలకు రూ.కోట్లు విడుదలవుతున్నా.. శివారుకాలనీల్లో వసతుల కల్పనకు కేటాయించడంలేదనే విమర్శలున్నాయి.


ఇవి మెట్‌పల్లి బల్దియా 12వార్డులోని ఖాళీ ప్లాట్లు. సమీప నివాసాల్లోంచి విడుదలైన మురుగునీరు వచ్చి చేరి ఇలా తయారైంది. డ్రైనేజీలు లేవు. మురుగునీటిని ఇలా వదిలేస్తున్నారు. దీనికి వరదనీరు తోడవుతోంది. దోమలు, ఈగలు వృద్ధి చెంది దుర్వాసన వెదజల్లుతోంది. మట్టిరోడ్లు, వీధిదీపాలు, మంచినీటి సౌకర్యం కూడా లేవు. తమది శివారుకాలనీ కావడంతో వివక్షకు గురవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మెట్‌పల్లి(కోరుట్ల): జిల్లాలోని మున్సిపల్ శివారు కాలనీలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయి. రోడ్లు, డ్రైనేజీలు, వీధిదీపాలు, తాగునీరు వంటి వసతులు లేవు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బల్దియాలకు ఏటా పెద్దఎత్తున నిధులు మంజూరు చేస్తున్నాయి. కానీ, ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యంతో కొన్నికాలనీలకే కేటాయిస్తున్నారు.

ఐదు మున్సిపాలిటీలు.. 134వార్డులు
- జిల్లాలో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటిలో 134 వార్డులు ఉన్నాయి.
- ఈ వార్డుల్లో మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వాల నుంచి ఏటా ప్రత్యేకంగా నిధులు మంజూరవుతున్నాయి. అలాగే మున్సిపల్‌కు చెందిన నిధులు కూడా వెచ్చించే అవకాశం ఉంటోంది.
- గతంలోనే జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపాలిటీలను అన్నివిధాలుగా అభివృద్ధి చేయడానికి రూ.50కోట్ల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది.
- ఈ నిధులతో మూడు పట్టణాల్లో చేపట్టిన పనులు దాదాపు పూర్తయ్యాయి.
- ఇటీవల కోరుట్ల, మెట్‌పల్లికి అదనంగా రూ.10కోట్ల చొప్పున విడుదల చేశారు. ఈ నిధులు వెచ్చించి చేపట్టే పనులపై అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.
- మేజర్ గ్రామ పంచాయతీలు ధర్మపురి, రాయికల్‌నూ మున్సిపాలిటీలుగా అప్‌గ్రేడ్ చేశారు కానీ, ఇప్పటివరకు నిధులు కేటాయించలేదు.

కేటాయింపులు అంతంతే..
పట్టణాల్లోని శివారు కాలనీలకు మిగతా వాటితో సమానంగా నిధులు కేటాయిస్తే ప్రజలకు సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి. కానీ అలా చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి. నామమాత్రంగా నిధులు కేటాయిస్తుండడంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉంటున్నాయి. ఏటా పన్నులు సక్రమంగా చెల్లిస్తున్నా తమకు వసతులు కల్పించడం లేదని, అభివృద్ధికి దూరంగా ఉంటున్నామని శివారుకాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బంది పడుతున్నాం

మా కాలనీలో వసతులు లేవు. రోడ్లు, డ్రైనేజీలు, నీటివసతి వంటివి కల్పించాలని అధికారులకు పలుమార్లు విన్నవించాం. అయినా ప్రయోజనం లేదు. సమస్యలతో చాలాఇబ్బందులు పడుతున్నాం.
– రమేశ్, బాలకృష్ణనగర్, మెట్‌పల్లి

ఏళ్లుగా సమస్యలు

మా వార్డు గతంలో వెంకట్రావ్‌పేట గ్రామ పంచాయతీ పరిధిలో ఉండేది. ప్రస్తుతం మున్సిపాలిటీలో విలీనం చేశారు. కానీ సమస్యలు అలాగే ఉన్నాయి. వసతులు లేక ఏళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.
– వినోద్, 12వార్డు, మెట్‌పల్లి

దృష్టి సారించాం

కొన్ని వార్డుల్లో మౌలిక వసతుల సమస్య ఉంది. వాటిపై ప్రత్యేకంగా దృష్టి సారించాం. ఇటీవల ప్రభుత్వం రూ.10కోట్లు మంజూరు చేసింది. వీటిలోంచి ఆ వార్డులకు అధిక నిధులు కేటాయించడానికి ప్రయత్నిస్తాం.
– జగదీశ్వర్‌గౌడ్, కమిషనర్, మెట్‌పల్లి మున్సిపాలిటీ

ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు
- కలెక్టర్ యాస్మిన్ బాషా


మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్‌బాషా

జగిత్యాల: ప్రశాంత వాతావరణంలో గణేశ్ ఉత్సవాలు జరుపుకోవాలని కలెక్టర్ యాస్మిన్ బాషా సూచించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గణేశ్ ఉత్సవాలతోపాటు, ఈద్ మిలాద్ ఉల్ నబీ వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సోషల్ మీడియా ద్వారా వ్యాపించే వదంతులను నమ్మవద్దని చెప్పారు. పోలీసు, ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అన్నారు. గణేశ్ మండపాల పేర్లను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని మున్సిపాలిటీలు, మండలస్థాయిలో గణేశ్ ఉత్సవాల నిర్వహణపై పోలీసు, రెవెన్యూ, పంచాయతీ, ఇతర శాఖల అధికారులు ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశాలు కావాలని ఆదేశించారు. వినాయక చవితి నుంచి నిమజ్జనం వరకూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలన్నారు. విద్యుత్ శాఖ నుంచి మండపాల నిర్వాహకులు అనుమతి తీసుకోవాలన్నారు. గణేశ్ నిమజ్జనానికి రూట్‌మ్యాప్, రోడ్ల మరమ్మతును ముందస్తుగా చేపట్టాలని చెప్పారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులను పూజించాలని కోరారు. ఎస్పీ భాస్కర్ మాట్లాడుతూ, గణేశ్ మండపాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా వ్యవస్థ ఏర్పాటు చేయాలన్నారు. భక్తిపాటలు మాత్రమే వేయాలని సూచించారు. అన్నిమతాలు, వర్గాల వారి మనోభావాలను గౌరవించాలని అన్నారు. నిమజ్జనం సందర్భంగా రెచ్చగొట్టే అంశాల జోలికి వెళ్లవద్దని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులకు సహకరించాలని జిల్లావాసులను కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లత, అదనపు ఎస్పీ ప్రభాకర్, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, డీఎస్పీలు పాల్గొన్నారు.

సత్వర సేవల కోసమే కార్యాలయాలు
- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత


కార్యాలయం ప్రారంభిస్తున్న సంజయ్, వసంత

జగిత్యాలరూరల్: రాష్ట్ర ప్రభుత్వం సత్వర సేవలు అందించేందుకు జిల్లా కేంద్రంలో నూతన కార్యాలయాలు ప్రారంభిస్తోందని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ కార్యాలయం సమీపంలో పంచాయతీరాజ్ శాఖ ఉప ఇంజినీరింగ్ కార్యాలయాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇంజినీరింగ్ విభాగంలో అన్నికార్యాలయాలు జిల్లా కేంద్రంలో అందుబాటులోకి తెచ్చామన్నారు. నిఘా విభాగంతోపాటు, నాణ్యత నియంత్రణ విభాగం జిల్లాలో అందుబాటులో ఉందని వారు తెలిపారు.

మహిళల ఆరోగ్యమే కేసీఆర్ లక్ష్యం
సారంగాపూర్(జగిత్యాల): రాష్ట్రంలో ప్రతీ మహిళ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యమని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. మహిళలు ఎదుర్కొనే ఎనిమిది అంశాల్లో వైద్యపరీక్షలు నిర్వహించి తగిన విధంగా సూచనలు, సలహాలు అందిస్తారని, అవసరమైన వారికి చికిత్సలను ఉచితంగా ఇస్తారని తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. వారి భద్రత కోసం షీటీమ్స్ ఏర్పాటు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో శ్రీధర్, ఉమ్మడి జిల్లా కేడీసీసీబీ డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, ఎంపీపీ కోల జమున, జెడ్పీటీసీ మేడిపల్లి మనోహర్‌రెడ్డి, మాతాశిశు సంరక్షణాధికారి జయపాల్‌రెడ్డి, మండల వైద్యాధికారి రాణిమైత్రీరెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు గుర్రాల రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం రేచపల్లి గ్రామంలో రెండు రోజుల క్రితం మృతి చెందిన జరీనా కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పరామర్శించారు. ఆయన వెంట పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

నెలాఖరులోగా వంద పడకల ఆస్పత్రి పూర్తి
- ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

కోరుట్ల: ఈనెలాఖరులోగా వంద పడకల ఆస్పత్రి పనులు పూర్తిచేస్తామని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఆస్పత్రి సలహా మండలి సభ్యుల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ, వచ్చే నెల మొదటివారంలో ఆస్పత్రి అందుబాటులోకి వస్తుందన్నారు. అదనంగా రెండు డయాలసిస్ యంత్రాలు సమకూర్చుతామని తెలిపారు. ఆస్పత్రి ప్రారంభానికి ముందే వైద్యసిబ్బంది అందుబాటులో ఉంటారని చెప్పారు. నిర్వహణ పనుల కోసం రూ.1.20 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. గతంలో 25 మంది నుంచి 30 మంది ఓపీ పేషెంట్లు ఉండేవారని, ప్రస్తుతం అన్ని వసతులు కల్పించడంతో రోజూ 250 మంది వరకు వైద్య సేవలు పొందుతున్నారని తెలిపారు. ఎంపీపీ తోట నారాయణ, బీఆర్‌ఎస్ నాయకులు అనిల్, రాజేశ్ ఉన్నారు.

15 గ్రామపంచాయతీలకు 'స్వచ్ఛ' పురస్కారాలు
జగిత్యాలరూరల్: జిల్లాలోని 15 గ్రామపంచాయతీలు స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ – 2023 అవార్డులకు ఎంపికయ్యాయి. వీటికి కలెక్టర్ కార్యాలయంలో బుధవారం అవార్డులు అందజేస్తారు.

గ్రామపంచాయతీ	మండలం
చిన్నాపూర్	బుగ్గారం
నడికుడ	మల్లాపూర్
గుమ్లాపూర్	కోరుట్ల
చింతలపేట	మెట్‌పల్లి
వెంగళాపూర్	గొల్లపల్లి
భూపతిపూర్	రాయికల్
మగ్గిడిఎండపల్లి	ధర్మపురి
రాఘవపట్నం	గొల్లపల్లి
మద్దులపల్లి	పెగడపల్లి
తాటిపల్లి	మల్యాల
నాచుపల్లి	కొడిమ్యాల
ఇబ్రహీంపట్నం	ఇబ్రహీంపట్నం
చల్‌గల్	జగిత్యాలరూరల్
అల్లీపూర్	రాయికల్
వెల్లుల్ల	మెట్‌పల్లి

కొలతల్లో మాయాజాలం
- ట్రేడ్‌లైసెన్స్‌ల జారీలో అక్రమాలు
- ముందుకురాని వ్యాపారులు
- మున్సిపల్ ఆదాయానికి గండి

➡ జగిత్యాల టవర్‌సర్కిల్ ప్రాంతంలో ప్రముఖ షాపింగ్‌మాల్ ఉంది. ట్రేడ్ లైసెన్స్ కోసం యజమాని దరఖాస్తు చేసుకున్నారు. అది రెండతస్తుల్లో ఉంటే.. ఒక అంతస్తుకే ట్రేడ్‌లైసెన్స్ జారీచేశారు.

➡ జగిత్యాల కొత్తబస్టాండ్ సమీపంలో మరో షాపింగ్‌మాల్ ఉంది. ఇది మూడు అంతస్తుల్లో ఉంది. యజమానులు దరఖాస్తు చేసుకోగా ఒక అంతస్తుకే ట్రేడ్‌లైసెన్స్ జారీచేసినట్లు తెలిసింది.


జగిత్యాలలోని దుకాణ సముదాయాలు

జగిత్యాల: జిల్లాలోని పలు మున్సిపాలిటీల ట్రేడ్‌లైసెన్స్‌ల జారీలో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. గతంలో పనిచేసిన సిబ్బంది షాపింగ్ కాంప్లెక్స్‌ల యజమానులతో కుమ్మక్కై, తక్కువ కొలతలు వేసి ట్రేడ్‌లైసెన్స్ జారీచేస్తూ అందినకాడికి పుచ్చుకున్నట్లు తెలిసింది.

2 వేలకు పైగా షాపులు..
జిల్లా కేంద్రంలో దాదాపు 2 వేలకుపైగా దుకాణాలు ఉంటాయి. పెద్ద వ్యాపార సముదాయాలు 100 వరకు ఉంటాయి. జిల్లాకేంద్రంతోపాటు, కోరుట్ల, మెట్‌పల్లిలోనూ వాణిజ్య సముదాయాలున్నాయి. ప్రత్యేకమైన వాణిజ్య సముదాయాలను గుర్తించి వాటికి కొలతలు తీసి ట్రేడ్ లైసెన్స్ జారీచేయాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ ఒక అంతస్తుకే కొలతలు తీసుకుని పెద్దషాపింగ్‌మాల్ మొత్తానికి లైసెన్స్‌లు జారీచేస్తూ అక్రమాలకు తెరలేపుతున్నారు. ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం, ఉన్నతాధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో మున్సిపల్ ఆదాయానికి గండిపడుతోంది.

లొసుగులను ఆధారంగా చేసుకుని..
ఆస్తిపన్ను, నల్లా బిల్లు, ఇంటి నిర్మాణ అనుమతులు.. ఇలా ప్రతీది మున్సిపాలిటీలో ఆన్‌లైన్ చేశారు. ట్రేడ్‌లైసెన్స్‌ల జారీనీ ఆన్‌లైన్ చేశారు. ఇందులోని లొసుగులను ఆసరాగా చేసుకున్న అధికారులు.. వ్యాపారులతో కుమ్మక్కై అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలున్నాయి. అధికారులు ప్రతీ దుకాణాన్ని పరిశీలించి ట్రేడ్‌లైసెన్స్ రుసుం వసూలు చేయాల్సి ఉంటుంది. కానీ, ఇష్టానుసారంగా కొలతలు చేస్తూ అందినకాడికి దోచుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. 147 జీవో ప్రకారం జనవరి నుంచి చదరపు అడుగుల లెక్కన ట్రేడ్ లైసెన్స్ రుసుం వసూలు చేయాలని ప్రభుత్వం ఇటీవల ఆదేశించింది.

ప్రభుత్వం నిర్ణయించిన ధరలు
- సింగిల్‌లైన్ 20 ఫీట్ల రోడ్డు – రూ.3(చదరపు అడుగులు)
- డబుల్‌లైన్ 30 ఫీట్ల రోడ్డు – రూ.4(చదరపు అడుగులు)
- మల్టిపుల్‌లైన్ 30 ఫీట్ల రోడ్డు – రూ.5(చదరపు అడుగులు)
- మినిమమ్ ట్రేడ్‌లైసెన్స్ ఫీజు – రూ.4 నుంచి 7(చదరపు అడుగులు)

50 శాతం లైసెన్స్‌లు లేనివే..
జిల్లాలో ఐదు మున్సిపాలిటీలు ఉన్నాయి. దాదాపు 50 శాతం దుకాణాలకు ట్రేడ్ లైసెన్స్‌లు లేవు. యజమానులు కూడా ముందుకు రావడం లేదు. దీంతో కొద్దిరోజులుగా వ్యాపారులకు నోటీసులు జారీ చేస్తున్నారు. ధరలు పెరగడంతో ప్రముఖ వ్యాపార సంస్థల యజమానులు అధికారులతో కుమ్మ క్కై నచ్చిన కొలతలు చూపి ట్రేడ్‌లైసెన్స్ పొందుతున్నారు.

తనిఖీలు చేస్తాం
ప్రతీఒక్కరు ట్రేడ్‌లైసెన్స్ తీసుకోవాలి. గతంలో తీసుకున్న వాటిని తనిఖీ చేస్తాం. నిబంధనల ప్రకారం లేకుంటే చర్యలు తీసుకుంటాం.
– అనిల్‌బాబు, మున్సిపల్ కమిషనర్, జగిత్యాల

క్లుప్తంగా

ఉపాధ్యాయుల అర్జీలు పరిష్కరించాలి


డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జగిత్యాల: జిల్లాలో ప్రస్తుతం జరుగుతున్న బదిలీలు, ప్రమోషన్లలో ఉపాధ్యాయులు పెట్టుకున్న అర్జీలను పరిష్కరించాలని తపస్ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం డీఈవో జగన్‌మోహన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సీనియారిటీ జాబితాలో లోపాలు లేకుండా చూడాలని, రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నరేందర్‌రావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దేవయ్య, ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

‘దుబ్బరాజన్న’ రాజగోపుర నిర్మాణానికి విరాళాలు

సారంగాపూర్: మండలంలోని పెంబట్ల–కోనాపూర్ గ్రామాల్లో వెలసిన ప్రముఖ పుణ్యక్షేత్రం దుబ్బరాజన్న ఆలయ రాజగోపుర నిర్మాణానికి పలువురు భక్తులు మంగళవారం విరాళాలు అందించారు. జగిత్యాల పట్టణానికి చెందిన చిలుక రాజేందర్ రూ.1,00,116, సారంగాపూర్‌కు చెందిన కాలగిరి రఘుపతిరెడ్డి–విజయ దంపతులు రూ.25,116, జగిత్యాల రూరల్ మండలంలోని బాలెపల్లికి చెందిన పడిగెల మోహన్‌రెడ్డి రూ.25 వేలు, జగిత్యాల పట్టణానికి చెందిన తిగుళ్ల శరత్‌రెడ్డి రూ.25 వేలు, గుల్లపేటకు చెందిన తాటిపర్తి సిద్ధార్థరెడ్డి రూ.25 వేలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో అనూష, చైర్మన్ పొరండ్ల శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

దుబ్బరాజన్న ఆలయంలో ఉట్టి వేడుక



సారంగాపూర్: దుబ్బరాజన్న ఆలయంలో ఉట్టి కొట్టే వేడుక మంగళవారం రాత్రి ఘనంగా జరిగింది. శ్రావణమాసం ముగింపు సందర్భంగా శ్రీకృష్ణుడిని ఆరాధించే ఆనవాయితీలో భాగంగా గోపాల కాలువలను నిర్వహించారు. వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. అంతకుముందు ఆలయంలో 24 గంటలపాటు నిరంతర భజన కార్యక్రమం, కోనేరులో పూజలు జరిపారు.

కోరెంలో చోరీ

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని కోరెం గ్రామానికి చెందిన సంబు అంజమ్మ ఇంట్లో చోరీ జరిగిందని ఎస్సై మహేందర్ మంగళవారం తెలిపారు. అంజమ్మ కుమారుడు సాగర్ వేములవాడలో జీవనోపాధి కోసం ఉంటున్నాడు. తల్లి అంజమ్మ ఒక్కతే కోరెంలో ఉంటుంది. సోమవారం ఉదయం అంజమ్మ కుమారుడు సాగర్ వద్దకు వేములవాడకు వెళ్లింది. సాయంత్రం వచ్చి చూసేసరికి ఇంట్లో సామగ్రి చిందరవందరగా పడి ఉంది. ఐదు తులాల బంగారు, 20 తులాల వెండి ఆభరణాలు దొంగలు ఎత్తుకెళ్లారని అంజమ్మ కుమారుడు సాగర్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్ వివరించారు.

రేషన్ కమీషన్‌కు ఎదురుచూపు

- నాలుగు నెలలుగా అందని వైనం
- రెట్టింపు చేస్తున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం
- హెల్త్ కార్డు, బీమా సౌకర్యం కల్పనకు నిర్ణయం
- జిల్లాలో 592 మంది డీలర్లు


బియ్యం పంపిణీ చేస్తున్న రేషన్ డీలర్

జగిత్యాలరూరల్: నాలుగు నెలలుగా కమీషన్ అందక రేషన్ డీలర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఒక పక్క డీలర్లకు కమీషన్ రెట్టింపు చేస్తున్నట్లు ప్రకటించినా అది ఈ నెల నుంచి అమలవుతుందా లేదా అనే సంశయంలో ఉన్నారు. ఒకవేళ అమలు జరిగితే జగిత్యాల జిల్లాలో 592 మంది డీలర్లకు మేలు జరుగుతుంది. కమీషన్‌తోపాటు రూ.5 లక్షల వరకు హెల్త్ కార్డు, రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించనున్నారు. గతంలో క్వింటాల్‌కు ఉన్న రూ.70 కమీషన్‌ను రూ.140కి పెంచుతూ సర్కారు నిర్ణయం తీసుకుంది. 2014కు ముందు క్వింటాల్‌కు రూ.20 చొప్పున కమీషన్ ఇచ్చేవారు.

తప్పని ఎదురుచూపు

జిల్లాలోని రేషన్ డీలర్లకు ప్రభుత్వం నాలుగు నెలలుగా కమీషన్ విడుదల చేయడం లేదు. మే నెలకు సంబంధించి రూ.40.68 లక్షలు, జూన్ నెలకు సంబంధించి రూ.40.96 లక్షలు చెల్లించాల్సి ఉంది. జూలై, ఆగస్టు నెలల కమీషన్ కూడా అందకపోవడంతో వారికి ఎదురుచూపు తప్పడం లేదు.

స్టాక్ పాయింట్ల వద్దే వే బ్రిడ్జి

ప్రస్తుతం రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్య గోదాంల వద్ద చేసే తప్పుడు తూకం. వారికి పంపిణీ చేసే బియ్యానికి సంబంధించి ఎంఎల్‌ఎస్ పాయింట్లు, గోదాంల వద్ద బ్యాగుల్లో తక్కువ తూకం వస్తోంది. ఫలితంగా 50 కిలోల సంచిలో 2 నుంచి 5 కిలోల వరకు బియ్యంలో కోత పడుతోంది. దీంతో డీలర్లు పంపిణీ చేసేటప్పుడు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై ఎన్నిమార్లు ఫిర్యాదులు చేసినా, ఎంతమంది అధికారులు తనిఖీలు చేసినా సమస్యకు పరిష్కారం లభించడం లేదని అంటున్నారు. ఈ క్రమంలో నిరుత్సాహంలో ఉన్న డీలర్లకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇకపై స్టాక్ పాయింట్ల వద్ద వే బ్రిడ్జి ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి నిధులు విడుదల చేసింది. ఇక జిల్లా వారీగా నిధులను కేటాయిస్తే తూకానికి సంబంధించిన సమస్య కూడా తీరనుంది.

విడుదలవగానే జమ చేస్తాం



జగిత్యాల జిల్లాలో మే, జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించి రేషన్ డీలర్లకు ప్రభుత్వం నుంచి కమీషన్ రావాల్సి ఉంది. విడుదల చేయగానే వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తాం.

– వెంకటేశ్వర్‌రావు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

జగిత్యాలలో క్రిటికల్ కేర్

- 50 పడకలతో ఏర్పాటు
- చకచకా భవన నిర్మాణం


నిర్మాణంలో ఉన్న భవనం

జగిత్యాల: జగిత్యాల మెడికల్ హబ్‌గా మారింది. ఇప్పటికే 100 పడకల ఆస్పత్రి జిల్లా ఆస్పత్రిగా మారింది. గర్భిణుల కోసం ప్రత్యేకంగా మాతా శిశు సంక్షేమ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 330 పడకల ఆస్పత్రి కొనసాగుతోంది. ఇటీవల నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా క్రిటికల్ కేర్ సెంటర్ కూడా మంజూరైంది. భవన నిర్మాణం చకచకా కొనసాగుతోంది. దీంతో ఇరవై నాలుగు గంటల పాటు అత్యవసర సేవలు అందుతాయని జిల్లావాసులు ఆకాంక్షిస్తున్నారు.

క్రిటికల్ కేర్‌తో ప్రజలకు సౌకర్యాలు:

- ప్రమాదాలు, పాయిజన్, పాముకాట్లు.. ఇలా అత్యవసర సేవల కోసం క్రిటికల్ కేర్‌కు తీసుకొస్తే.. అందుబాటులో ఉన్న అన్ని విభాగాల వైద్యులు వెంటనే వైద్య చికిత్సలు చేస్తారు. ఇందులో ఐసీయూ పడకలు ఉంటాయి. ఇందులో 50 బెడ్స్ వరకు అందుబాటులో ఉంటాయి. ప్రస్తుతం జనరల్ ఆస్పత్రి ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సేవలు అందిస్తోంది. ఎమర్జెన్సీ క్రిటికల్ కేర్ అందుబాటులోకి వస్తే అత్యవసర సేవలు ఎల్లవేళలా అందుతాయి.

గోల్డెన్ మినట్..

ఒక నిమిషంలో ప్రాణం పోయే మనిషిని బతికించే అవకాశాలు క్రిటికల్ కేర్ యూనిట్‌లో చాలా ఉంటాయి. యాక్సిడెంట్లు, పాయిజన్ తాగినవారు, పాముకాటుకు గురైన వారు, గుండెపోటు వచ్చిన వారిని గోల్డెన్ అవర్‌లో తీసుకొస్తే ప్రాణాలు కాపాడుతారు.

మూడు ప్రధాన రహదారులు

జగిత్యాల నుంచి కరీంనగర్, నిజామాబాద్, మంచిర్యాల మీదుగా మూడు ప్రధాన రహదారులు జిల్లాలో ఉన్నాయి. ఈ మార్గంలో ఎక్కడ ప్రమాదాలు జరిగినా అత్యవసర సేవల కోసం క్రిటికల్ కేర్ ఎంతోదోహదం చేస్తుంది. దీని ఆవశ్యకతపై ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రాష్ట్రంలో 8 క్రిటికల్ కేర్ సెంటర్ మంజూరు కాగా, అందులో జగిత్యాల ఉండడం విశేషం. ప్రైవేట్ క్రిటికల్ కేర్‌లో జగిత్యాలలో అనేకం ఉన్నాయి. అత్యవసర సేవల కోసం బిల్లులు రోజుకు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు వేస్తున్నారు. ప్రభుత్వ క్రిటికల్ కేర్ సెంటర్ ఏర్పడితే పేదలకు ఆర్థిక ఇబ్బందులు ఉండవు.

కల్వకోట పొదుపు సంఘాల డబ్బుల్లో తేడా?

మేడిపెల్లి: మండలంలోని కల్వకోట గ్రామంలో మహిళా సంఘాలకు చెందిన పొదుపు డబ్బులను వీవోఏ శ్యామల తన సొంతానికి వాడుకున్నారని సభ్యులు ఆరోపించారు. నాలుగు సంఘాలకు సంబంధించిన డబ్బులను కొన్ని రోజులుగా బ్యాంకుల్లో జమ చేయడం లేదన్నారు. సౌందర్య సంఘంలో రూ.1,88,036, సహారా సంఘంలో రూ.42 వేలు, శ్రీవాణి సంఘంలో రూ.15వేలు, జ్యోతి సంఘంలో రూ.40 వేలు, విజేత సంఘంలో రూ.40 వేల తేడా గమనించినట్లు పేర్కొన్నారు. ఆ డబ్బులను తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై మండల ఏపీఎం అశోక్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం మహిళా సంఘాల పొదుపు డబ్బులపై ఆడిటింగ్ జరుగుతోందని, నిజానిజాల అనంతరం చర్యలు తీసుకుంటామన్నారని పేర్కొన్నారు. సంఘాల్లోని కొందరు మహిళలు పొదుపు డబ్బులు తీసుకొని, తిరిగి చెలించడంలో జాప్యం చేస్తున్నారని వీవోఏ శ్యామల తెలిపారు. వాటిని వసూలు చేసేందుకు ఒత్తిడి తెస్తున్నానని, ఇది తెలిసి కూడా కొందరు కావాలనే తనను తీసేసి, వారి భార్యలకు వీవోఏ జాబ్ ఇప్పించుకోవాలని ఇలా చేస్తున్నారని ఆరోపించారు.

ధర్మపురిలో అభివృద్ధిని చూపించండి

- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్
- 15న సోనియాగాంధీ సభకు రావాలని పిలుపు


సంఘీభావం తెలుపుతున్న లక్ష్మణ్‌కుమార్

గొల్లపల్లి: ధర్మపురి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి ఓట్లు వేయాలని మంత్రి కొప్పుల ఈశ్వర్ అడుగుతున్నారని, అసలు అభివృద్ధి ఎక్కడ జరిగిందో చూపించాలని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ డిమాండ్ చేశారు. గొల్లపల్లి మండల కేంద్రంలోని వైశ్య భవన్‌లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల కాలంలో నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యమన్నారు. సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్ తరహాలో ధర్మపురి ఎందుకు అభివృద్ధి చెందడం లేదో మంత్రి సమాధానం చెప్పాలన్నారు. ఈ నియోజకవర్గంలో మాజీ మంత్రి, దివంగత రత్నాకర్‌రావు చేసిన పనులే తప్ప మంత్రి హోదాలో కొప్పుల ఈశ్వర్ చేసిందేమీ లేదని విమర్శించారు. పాలిటెక్నిక్, ఐటీఐ, డిగ్రీ కళాశాలలు తీసుకువచ్చే అవకాశం ఉన్నా మంత్రి హోదాలో కనీసం ప్రయత్నం చేయలేదని మండిపడ్డారు. కాళేశ్వరం లింక్–2తోపాటు, ఎల్లంపల్లి కింద వెల్గటూర్, పెగడపల్లి, గొల్లపల్లి తదితర మండలాల్లో వందలాది ఎకరాల భూములను రైతుల నుంచి బలవంతంగా తీసుకుని, పరిహారం విషయంలో మోసం చేశారని ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ మతతత్వ పార్టీగా విభజించి, పాలించు అనే సిద్ధాంతంతో ముందుకుసాగుతోందని, ఇటు రాష్ట్ర ప్రభుత్వం మోసపూరిత హామీలు ఇస్తూ అధికారంలో కొనసాగుతోందన్నారు. ఈ నెల 17న హైదరాబాద్‌లోని తుక్కగూడలో ఏఐసీసీ అధినేత్రి సోనియాగాంధీ విజయభేరి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ధర్మపురి, గొల్లపల్లి, వెల్గటూర్, పెగడపల్లి, బుగ్గారం మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంగనభట్ల దినేశ్, ముస్కు నిషాంత్‌రెడ్డి, శైలేందర్‌రెడ్డి, రాములుగౌడ్, ఉపాధ్యక్షుడు నర్సాగౌడ్, బతికెపల్లి సర్పంచ్ శోభారాణి, సర్పంచ్‌లు సత్యనారాయణ, చిర్ర గంగాధర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కుంట సుధాకర్, యువజన పార్టీ అధ్యక్షుడు రమేశ్, ఉపసర్పంచ్ శ్రీధర్, సీనియర్ నాయకుడు తాండ్ర సురేందర్, యువజన సంఘం గొల్లపల్లి అధ్యక్షుడు తిరుపతి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల డిమాండ్లు నెరవేర్చాలి

వెల్గటూర్: అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెల్గటూర్ మండల కేంద్రంలో నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లకు మంగళవారం ఆయన సంఘీభావం తెలిపారు. వారి సమస్యలను ప్రభుత్వానికి నివేదించే సమయం కూడా మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు లేకపోయిందని ఎద్దేవా చేశారు. అడగక ముందే ఎమ్మెల్యేలకు రూ.లక్షల్లో జీతాలు పెంచిన సీఎం కేసీఆర్‌కు ప్రభుత్వ కార్యక్రమాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లే అంగన్‌వాడీలకు కనీస వేతనాలు పెంచడానికి మనసు రావడం లేదన్నారు. సమస్యలను పరిష్కరించకుంటే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు మురళి, జగదీశ్వర్‌రెడ్డి, ఉప సర్పంచ్ సందీప్, మండల యూత్ అధ్యక్షుడు పూదరి రమేశ్, బీసీ సెల్ అధ్యక్షుడు ఉదయ్, అసెంబ్లీ అధికార ప్రతినిధి విజయ్, నాయకులు పాల్గొన్నారు.

డీడీలు కట్టి 6 నెలలైంది.. ట్రాన్స్‌ఫార్మర్ ఏది?


వినతిపత్రం ఇస్తున్న వర్షకొండ రైతులు

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కోసం డీడీలు కట్టి 6 నెలలైందని, ఇప్పటివరకు ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వలేదని వర్షకొండ రైతులు తెలిపారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ విద్యుత్ వినియోగదారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్మన్ ఈశ్వరయ్యకు వినతిపత్రం అందించారు. వర్షకొండ పెద్దమ్మ ఆలయ సమీపంలో 9 మంది రైతులం రూ.5,295 చొప్పున డీడీలు కట్టి, గత మార్చి 23న అందించామన్నారు. ఇప్పటికీ ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వలేదని, తాము ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. వర్షకొండ గ్రామ బాధ్యతలు మేడిపల్లి సబ్‌స్టేషన్ ఏఈకి ఉన్నాయని, ఇబ్రహీంపట్నంకు 4 కిలోమీటర్ల దూరమే ఉన్నందున ఇబ్రహీంపట్నం ఏఈకి అప్పగించాలని రైతు బాయి లింగారెడ్డి కోరారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ఇబ్రహీంపట్నం మండలం నుంచి 6, మల్లాపూర్ మండలం నుంచి 1 దరఖాస్తులు వచ్చినట్లు ఏఈ సతీశ్ తెలిపారు. కార్యక్రమంలో వేదిక సభ్యులు అశోక్, కిషన్, రాజగౌడ్, ఎస్ఈ సత్యనారాయణ, ఎస్ఏవో తిరుపతయ్య, డీఈ గంగారం, ఏఏవో శంకర్, ఏఈలు రమేశ్, శివకుమార్, సబ్ ఇంజినీర్లు రాజేశ్‌నాయక్, వినీత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య మహిళతో సంపూర్ణ ఆరోగ్యం


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్, ఎమ్మెల్యే

మల్లాపూర్(కోరుట్ల): ఆరోగ్య మహిళ కార్యక్రమం ద్వారా మహిళలు సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని అదనపు కలెక్టర్ లత, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఆరోగ్య మహిళ కేంద్రాన్ని వారు మంగళవారం సందర్శించారు. మహిళల ఆరోగ్యం కోసం సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారన్నారు. బీపీ, షుగర్, క్యాన్సర్ తదితర వ్యాధులు గుర్తించి సకాలంలో చికిత్స అందించాలనేది ఆరోగ్య మహిళ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి ఆర్డీవో మధు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సంజయ్‌కుమార్, జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కాటిపెల్లి సరోజన, వైస్ ఎంపీపీ గౌరు నాగేశ్, తహసీల్దార్ వీర్‌సింగ్, ఎంపీడీవో జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

జూదరులపై కేసు

మల్యాల(చొప్పదండి): ముత్యంపేట శివారు దిగువ కొండగట్టులోని ఓ హోటల్‌లో పేకాడుతున్న వ్యక్తులను మంగళవారం పట్టుకున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.36,725 స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. హోటల్ యజమానితోపాటు ఎనిమిది మందిపై కేసు నమోదు చేశామన్నారు.

రేషన్ బియ్యం తరలింపు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో కొద్దికాలంగా ద్విచక్ర వాహనాలపై లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యాన్ని సేకరించి ఓ రహస్య ప్రాంతానికి తరలిస్తున్నారు. మంగళవారం భవానీనగర్‌లో ద్విచక్ర వాహనాలపై రేషన్ బియ్యం తరలిస్తుండగా స్థానికులు పట్టుకునేందుకు ప్రయత్నించారు. దీంతో వాహనదారు చాకచక్యంగా తప్పించుకుని పారిపోయాడు.

గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

మేడిపెల్లి: మండలంలోని పోరుమల్లకు చెందిన సుద్దాల తిరుపతి గౌడ్ మంగళవారం ఈత చెట్టు పైనుంచి పడటంతో తీవ్రంగా గాయపడ్డాడని స్థానికులు తెలిపారు. బాధితుడిని జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

కారును ఢీకొన్న లారీ


రోడ్డుపై నిలిచిన వాహనాలు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని కరీంనగర్ రోడ్డులో మంగళవారం రంగు గంగాధర్ అనే వ్యక్తి కారులో వెళ్తుండగా లారీ ఢీకొట్టింది. దీంతో కారు ఒకవైపు డోర్లు నుజ్జునుజ్జు అయ్యాయి. కారులో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాలేదు. ప్రధాన రహదారిపై ప్రమాదం జరగడంతో సుమారు గంటపాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ప్రమాదానికి కారకుడైన పెగడపల్లి మండలం ఎల్లాపూర్ గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ పరార్‌లో ఉన్నాడు.

షేర్ మార్కెట్ పేరుతో రూ.2.11 కోట్లు మోసం

- ఐదునెలలుగా అజ్ఞాతంలో నిందితులు
- పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు
- సీపీ రెమా రాజేశ్వరి వెల్లడి


అరెస్ట్ చూపిస్తున్న సీపీ రెమా రాజేశ్వరి

గోదావరిఖని: షేర్ మార్కెట్ పేరుతో రూ.2.11కోట్లు మోసం చేసి.. ఐదు నెలలుగా అజ్ఞాతంలో ఉన్న నిందితుడు చెవ్వా రవిని రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. సీపీ రెమా రాజేశ్వరి నిందితుడికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. రవి కమిషనరేట్ పరిధిలో సుమారు 50మందిని మోసం చేశాడు. షేర్ మార్కెట్‌లో డబ్బులు పెట్టుబడి పెడితే తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు ఇస్తానని ఆశ చూపేవాడన్నారు. డబ్బులు ఇస్తే లాభాలు రోజువారీగా, వారం, నెల వారీగా అధిక మొత్తంలో ఇస్తానని చెప్పి జిల్లాకు చెందిన 50 మంది నుంచి సుమారు రూ.2.11కోట్లు వసూలు చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి నేతృత్వంలో సీఐ సుధాకర్, ప్రత్యేక టీం ఏర్పాటు చేశారు. ఎప్పటిలాగే మరింత మందిని మోసం చేసేందుకు హైదరాబాద్ నుంచి మంచిర్యాల వస్తున్నాడనే సమాచారం మేరకు తనిఖీలు చేస్తుండగా.. మంచిర్యాల రైల్వేబ్రిడ్జి ప్రాంతంలో రవి అనుమానాస్పదంగా కనిపించాడు. వెంటనే అతడిని అరెస్ట్ చేసి క్రెడిట్ కార్డులు, బ్యాంక్ పాస్‌బుక్కులు, చెక్ బుక్కులు, రూ.8వేల నగదు, రిజిస్టర్ బుక్ స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. సమావేశంలో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, సీఐ సుధాకర్, అశోక్, ఎస్సైలు ప్రసాద్, లచ్చన్న సిబ్బంది ఉన్నారు.

ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ల రాష్ట్ర కమిటీ ఎన్నిక


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్టలో మంగళవారం ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ల నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా మంచిర్యాల డిపోకు చెందిన రెంక రవి, జనరల్ సెక్రటరీగా వరంగల్ డిపోకు చెందిన వంగ రాజు, కోశాధికారిగా సిరిసిల్ల డిపోకు చెందిన రాజునాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కోదాడ డిపోకు చెందిన దేవేందర్‌రెడ్డి, రాష్ట్ర ఇన్‌చార్జిగా మహబూబాబాద్ డిపోకు చెందిన శ్రావణ్‌కుమార్, ప్రచార కార్యదర్శిగా యాదగిరిగుట్ట డిపోకు చెందిన బూడిద నరేశ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యాదగిరిగుట్ట డిపో అద్దె బస్సు డ్రైవర్ల యూనియన్ అధ్యక్షుడు బూడిద నరేశ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో యూనియన్‌ను ఎన్నుకున్నట్లు అద్దె బస్సు డ్రైవర్ల సంఘం సభ్యులు తెలిపారు. అద్దె బస్సు డ్రైవర్ల సమస్యలపై ఉద్యమాలు చేస్తామన్నారు.

లింగనిర్ధారణ నేరం

- ప్రోత్సహిస్తే కఠిన చర్యలు
- డీఎంహెచ్‌వో శ్రీధర్


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శ్రీధర్

జగిత్యాల: గర్భస్థ లింగనిర్ధారణ నిషేధమని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో శ్రీధర్ హెచ్చరించారు. మంగళవారం జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో గర్భస్థపిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం సలహా సంఘం సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ, లింగనిర్ధారణను ప్రోత్సహించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో 67 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయని తెలిపారు. జిల్లాలో గత సంవత్సరం వెయ్యిమంది మగ శిశువులకు 962 ఆడ శిశువులు ఉండగా, ఈసంవత్సరం తొలి ఆరు మాసాల్లో 974 ఉన్నట్లు తెలిపారు. గర్భిణులను స్కానింగ్ చేసే సమయంలో వైద్యుడు తన పేరు బ్యాడ్జీ తప్పకుండా ధరించాలన్నారు. డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ మాట్లాడుతూ, లింగ నిర్ధారణకు అవకాశం ఉన్న అన్ని సెంటర్లపై నిఘా ఉంచడంతోపాటు, ఆకస్మికంగా తనిఖీలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో ప్రోగ్రాం అధికారులు సమియొద్దీన్, డాక్టర్ జైపాల్‌రెడ్డి, స్త్రీవైద్య నిపుణురాలు ఒడ్నాల రజిత, రేడియాలజిస్ట్ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల బాధ్యత వీవోఏలకు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలంలోని పలు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ బాధ్యతను ఐకేపీ వీవోఏలకు అప్పగించారు. ఈ సందర్భంగా మంగళవారం బండలింగాపూర్, చౌలమద్ది గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల తాళాలను పగులగొట్టి, సరుకులను వీవోఏలకు అప్పజెప్పారు. ఇక నుంచి చిన్నారులకు పౌష్టికాహారం అందేలా చూడాలని అధికారులు సూచించారు. అంతకుముందు సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లను ఆయా కేంద్రాల తాళాలు ఇవ్వాలని స్థానిక ఐసీడీఎస్ అధికారులు కోరగా వారు ససేమిరా అన్నట్లు తెలిసింది. దీంతో జిల్లా ఉన్నతాధికారుల సూచనలతో తప్పని పరిస్థితుల్లో తాళాలు పగులగొట్టి, వీవోఏలకు బాధ్యత అప్పగించారు.

విద్యావలంటీర్లను నియమించాలి


డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జగిత్యాల: విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలల్లో తెలుగు, హిందీ బోధించేందుకు ఉపాధ్యాయులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ప్రత్యామ్నాయంగా విద్యావలంటీర్లను నియమించాలని ఆర్‌యూపీపీటీ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం డీఈవో జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి, వినతిపత్రం అందించారు. ఉన్నత పాఠశాలల్లో ఉన్నతి కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్న నేపథ్యంలో పోస్టులు తక్కువగా ఉండటంతో ఇబ్బందికరంగా మారిందని పేర్కొన్నారు. భాషా పండితులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని విన్నవించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దండె రాజేందర్, వేల్పుల స్వామి, సంపత్‌కుమార్, శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి


రికార్డులు తనిఖీ చేస్తున్న డీపీవో దేవరాజ్

కథలాపూర్(వేములవాడ): గ్రామాల్లో ఓటరు నమోదుపై పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్ సూచించారు. మంగళవారం ఆయన వివిధ గ్రామాల్లో పర్యటించి రికార్డులను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో పారిశుధ్యం నిర్వహణపై నిర్లక్ష్యం చేయవద్దన్నారు. డ్రైనేజీలు సిబ్బందితో తరచూ శుభ్రం చేయాలని చెప్పారు. ఓటరు జాబితా ఆధారంగా దివ్యాంగ ఓటర్లను గుర్తించి ప్రత్యేకంగా రికార్డులు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి చెదలు నారాయణ, బండి సత్తయ్య, ఇస్మాయిల్, నరేశ్ ఉన్నారు.